సాక్షి
అనకాపల్లి
బుధవారం । 12 । జూన్ । 2024



కల్యాణం.. కమనీయం

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



కనకమ్మకు పద్మారాధన

విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.5/27.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశముందని ఆర్ఏఆర్ఏఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి చెప్పారు.

న్యూస్‌రీల్

హోమీబాబా కేన్సర్ ఆస్పత్రికి రేడియో థెరపీ యంత్ర సామగ్రి



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఆస్పత్రి ప్రతినిధులు

అగనంపూడి: కేన్సర్ బాధితులకు మెరుగైన సేవలు అందించాలనే సత్సంకల్పంతో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఉదారతను చాటుకుంది. సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్)లో భాగంగా హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధనా సంస్థకు రూ.34.62 కోట్ల విలువైన రేడియో థెరపీ యంత్ర సామగ్రి రింగ్ బేస్డ్ లీనర్ ఆక్సిలేటర్(లినాక్)ని అందించింది. ఈ మేరకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధి సూర్య చంద్రరావు, కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతిశెట్టి పరస్పర ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ పవర్ గ్రిడ్ సంస్థ సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా కేన్సర్ రోగులకు మెరుగైన, అధునాతన పద్ధతిలో సేవలు అందించే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. మహంతి శెట్టి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన కేన్సర్ బాధితులే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూడా రోగులు తమ ఆస్పత్రి సేవలు పొందుతున్నట్లు వెల్లడించారు. కేన్సర్ క్రిటికల్ కేర్ యూనిట్‌కు దోహదపడే యంత్ర సామగ్రిని అందించిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీఎం పాలెం (విశాఖ): జీవీఎంసీ 8వ వార్డులోని విశాఖ అంధుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. 2014–25 సంవత్సరానికి గాను ఉత్తరాంధ్రలోని 5 నుంచి 20 ఏళ్ల వయసు గల అంధ బాలబాలికలు అర్హులని పేర్కొంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం, వసతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉచిత వసతి సదుపాయం కల్పించనుంది. వివరాలకు 99895 62498,92472 36898 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

హత్యకేసులో పదేళ్ల జైలు శిక్ష

అనకాపల్లి: ఆస్తి వివాదంలో మేనల్లుడిని హతమార్చిన వ్యక్తికి పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.10 లక్షల జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా సొమ్ములో రూ.9.5 లక్షలు బాధిత కుటుంబానికి ఇవ్వాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అందించిన వివరాలు.. నిందితుడు పైల రమణ ఉమ్మడి విశాఖ జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా) నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందినవాడు. మృతుడు సుర్ల వెంకటరమణ పైల రమణకు మేనల్లుడు. ఇద్దరు ఒకే గ్రామంలో ఉంటున్నారు. వీరి మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆస్తి కోసం తరచూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో 2014 అక్టోబరు 25వ తేదీన వెంకటరమణ సమీపంలోని సంతకు వెళ్లాడు. సాయంత్రం 4.30 గంటల సమయంలో నిందితుడు పైల రమణ కాపుకాచి వెంకటరమణపై ఇటుకలు, బండరాళ్లతో దాడి చేశాడు. తీవ్ర గాయాల మధ్య వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి నర్సీపట్నం రూరల్ సీఐ దాశరథి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 302 సెక్షన్ కింద నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట–బల్హార్షా సెక్షన్, అసిఫాబాద్–రెచిని స్టేషన్ల మధ్య జరుగుతున్న 3వ లైన్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో దారి మళ్లించనున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు వయా విశాఖపట్నం–దువ్వాడ–విజయవాడ–వరంగల్–బల్హార్షా మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం–రాయగడ–టిట్లాగడ్–రాయ్‌పూర్–నాగ్‌పూర్ మీదుగా నడుస్తాయన్నారు.

దారి మళ్లించిన రైళ్లు

- విశాఖపట్నం–న్యూఢిల్లీ–విశాఖపట్నం (20805/ 20806) ఏపీ ఎక్స్‌ప్రెస్‌లు జూన్ 22 నుంచి జూలై 5 వరకు
- విశాఖపట్నం–గాంధీధామ్(20803) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 27, జూలై 5 తేదీల్లో
- గాంధీధామ్–విశాఖపట్నం(20804) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లో
- విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్(12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ జూన్ 24, 28, జూలై 1, 5 తేదీల్లో
- హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం(12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 26, 30, జూలై 3వ తేదీల్లో
- పూరి–ఓఖా(20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లో దారి మళ్లిస్తారు.

ఈఏపీసెట్ మెరుపులు

ఉత్తమ ర్యాంకులతో రాణించిన జిల్లా విద్యార్థులు

ఏపీ ఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల కాగా ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ విభాగంలో యలమంచిలి పట్టణానికి చెందిన కట్టమూరి కుషల్ రాష్ట్ర స్థాయిలో 97వ ర్యాంకు సాధించి జిల్లాలో ప్రథముడిగా నిలవగా.. 500 లోపు ర్యాంకులను ఎనిమిదిమంది విద్యార్థులు కైవసం చేసుకున్నారు.



97వ ర్యాంకు సాధించిన కుషల్‌కు స్వీటు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

యలమంచిలి రూరల్: ఏపీ ఈఏపీసెట్–2024లో యలమంచిలి పట్టణానికి చెందిన కట్టమూరి కుషల్ జిల్లా టాపర్‌గా నిలిచి సత్తా చాటాడు. కోర్టుపేటకు చెందిన కుషల్ 86.62 స్కోర్‌తో రాష్ట్ర స్థాయిలో 97వ ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. రెండు రోజుల క్రితం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కూడా కుషల్ ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 1345వ ర్యాంక్ సాధించాడు. కుషల్ చిన్నతనం నుంచి చదువులో మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు. పదో తరగతిలో 600కి 589 మార్కులు, ఇంటర్మీడియట్‌లో సీబీఎస్ఈ 500కి 478 మార్కులు సాధించాడు. గత నెల 18వ తేదీన విడుదలయిన తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో కూడా కుషల్ 196వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. విద్యార్థి తండ్రి రాజేష్ రాంబిల్లి మండలం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తమ కుమారుడు వరుస విజయాల పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. బంధువులు, స్నేహితులతో ఆనందం పంచుకున్నారు.

ధనుంజయకు 193వ ర్యాంకు

పాయకరావుపేట: ఏపీ ఈఏపీసెట్‌లో పట్టణానికి చెందిన చోడిశెట్టి ధనుంజయ 193వ ర్యాంకు సాధించాడు. తాను 6వ తరగతి నుంచి 10 వరకు తుని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో చదివినట్లు తెలిపాడు. ఇంటర్మీడియట్ రాజమండ్రిలో చదివిన ధనుంజయ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కూడా మెరుగైన ర్యాంకు సాధించాడు.



సుజానకుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న అమ్మమ్మ, తాతయ్య

అర్జునగిరి విద్యార్థికి 265వ ర్యాంకు

చీడికాడ: మండలంలోని అర్జునగిరికి చెందిన విద్యార్థి కసిరెడ్డి సాయి చంద్రకిరణ్‌నాయుడు మంగళవారం విడుదలైన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో స్టేట్ 265వ ర్యాంకు సాధించాడు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విశాఖలో శ్రీచైతన్య విద్యా సంస్థల్లో చదివాడు. టెన్త్‌లో 591 మార్కులు, ఇంటర్ (సీబీఎస్ఈ)లో 482 మార్కులు సాధించాడు. అక్కడే కోచింగ్ తీసుకున్నాడు. ఐఐటీలో చేరనున్నట్లు విద్యార్థి తెలిపాడు. విద్యార్థి తల్లి కనకమహాలక్ష్మి గృహిణి కాగా, తండ్రి ప్రసాద్ వృత్తి రీత్యా వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.



విఘ్నేష్‌కు స్వీటు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

జుత్తాడ విద్యార్థికి 393వ ర్యాంకు

చోడవరం రూరల్: మండలంలోని జుత్తాడ గ్రామానికి చెందిన విద్యార్థి బుద్దా విఘ్నేష్ కుమార్ ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 393వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ఐదో స్థానంలో నిలిచాడు. ఈ ఫలితాల్లో 77.6564 కంబైన్డ్ స్కోరుతో 393 ర్యాంకు పొందాడు. రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యా సంస్థల్లో ఇంటర్ చదివి 989 మార్కులు సాధించాడు. కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్‌లో చేరాలన్నది తన కోరిక అని విద్యార్థి తెలిపాడు. అతడి తండ్రి నాగ వరహా శ్రీనివాసరావు ప్రజా రవాణా వ్యవస్థ అనకాపల్లి డిపోలో బస్సు కండక్టర్‌గా, తల్లి బుద్దా దేవి ప్రైవేటు విద్యా సంస్థలో టీచర్‌గా చేస్తున్నారు.



అల్లక మహేష్
490వ ర్యాంక్

పాయకరావుపేట విద్యార్థికి 453వ ర్యాంకు

పాయకరావుపేట: పట్టణానికి చెందిన అంబటి దుర్గాలక్ష్మి నిఖిలేశ్వర్ ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో 453వ ర్యాంకు సాధించాడు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో 10వ తరగతి వరకు, విజయవాడ శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుకున్నాడు. ఇటీవల జేఈఈ ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించినట్లు విద్యార్థి తెలిపాడు.

సత్తా చాటిన నీలంపేట కుర్రాడు

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామానికి చెందిన వంటాకుల సుజనాకుమార్ మంగళవారం విడుదల చేసిన ఏపీ ఈఏపీసెట్‌లో ఫలితాల్లో 541 ర్యాంక్ సాధించాడు. తండ్రి సత్తిబాబు రాజమండ్రిలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి శ్రీవాణి గృహిణి. సుజనాకుమార్ ఇంటర్మీడియేట్ గుంటూరులో చదివాడు. 541 ర్యాంక్ రావటం చాలా సంతోషంగా ఉందని, కెమికల్ ఇంజనీరింగ్‌లో రాణించడమే తన లక్ష్యమని తెలిపాడు.

గుల్లేపల్లి విద్యార్థికి 674వ ర్యాంక్

కె.కోటపాడు: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో మండలంలో గుల్లేపల్లి గ్రామానికి చెందిన గొలగాని మారుతి 674వ ర్యాంకు సాధించాడు. గొండుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు, మారికవలస శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివి 987 మార్కులు పొందాడు. ఇంజినీరింగ్‌లో చేరి ఉన్నత ఉద్యోగావకాశాలు పొందనున్నట్లు విద్యార్థి తెలిపాడు. అతడిని తల్లిదండ్రులు సముద్రం, అచ్చియ్యమ్మ అభినందించారు.

ఇంజనీర్ కావాలని...

కశింకోట: మండలంలోని బయ్యవరానికి చెందిన అల్లక మహేష్ ఈఏపీసెట్‌లో 490వ ర్యాంకు సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు, తల్లి సుభాషిణి. తండ్రి అనకాపల్లి అపోలో మెడికల్స్‌లో చిరుద్యోగి. అతనికి ఇద్దరు కుమారుల్లో మహేష్ రెండోవాడు. పెద్ద కొడుకు భరత్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతున్నాడు. రెండో కుమారుడు మహేష్. ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తాను ఇంజనీర్ కావాలని ఆశిస్తున్నట్లు మహేష్ సాక్షికి తెలిపాడు.



ధనుంజయ
193వ ర్యాంకు



సాయిచంద్రకిరణ్
265వ ర్యాంకు



నిఖిలేశ్వర్
453వ ర్యాంకు



మారుతి
674వ ర్యాంక్



కార్తికేయ
291వ ర్యాంక్



దినేష్‌కుమార్
495వ ర్యాంక్

కంప్యూటర్ ఇంజనీరింగ్‌పై ఆసక్తి

అనకాపల్లి కోట్ని వీధికి చెందిన కర్రి ఊర్జిత్ కార్తికేయ 291వ ర్యాంకు సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు, తల్లి ధనలక్ష్మి. సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో తల్లి ఉపాధ్యాయురాలు. వీరికి ఇద్దరు కుమారుల్లో కార్తికేయ పెద్దవాడు. ర్యాంకు సాధించడం పట్ల తల్లి ధనలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తూ కుమారుడిని అభినందించారు. కంప్యూటర్ ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో ర్యాంక్ సాధించినట్లు కార్తికేయ చెప్పాడు.

సైంటిస్టుగా ఎదగాలని..

అనకాపల్లిలోని పూడిమడక ప్రాంతానికి చెందిన కశిరెడ్డి దినేష్‌కుమార్ ఈఏపీసెట్‌లో 495 ర్యాంకు సాధించాడు. తండ్రి అక్కునాయుడు, తల్లి అరుణలకు ఏకైక కుమారుడు. వ్యవసాయ కుటుంబం. ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో సైంటిస్టుగా ఎదగాలన్నది తన ఆకాంక్ష అని దినేష్‌కుమార్ తెలిపారు. తమ కుమారుడికి ఉత్తమ ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

- పెదపాడు విలేజ్ క్లినిక్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ



పెదపాడు విలేజ్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

అచ్యుతాపురం: మాతాశిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని ఆ శాఖ అనకాపల్లి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి లూసికార్డిలియా ఆదేశించారు. మండలంలోని పెదపాడు విలేజ్ క్లినిక్‌ను మంగళవారం టాస్‌ఫోర్స్ బృందం సందర్శించి అక్కడ రికార్డులను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా లూసికార్డిలియా మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని సూచించారు. పీహెచ్‌సీలోనే ప్రతీ కాన్పు జరిగేలా వైద్య సిబ్బంది సమన్వయం చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, డీపీవో జగదీష్, డీపీహెచ్ఎన్‌వో నాగమణి, ఐడీఎస్‌పీ కోఆర్డినేటర్ జనార్దన్ ఉన్నారు. కార్యక్రమంలో హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంతకుమార్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, హెచ్ఈ రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు రామలక్ష్మి, ఉమామహేష్, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, శివమ్మ, నాగలక్ష్మి, రమ్య, గాయత్రి, మహాలక్ష్మి, దేవుడమ్మ, ఆశా కార్యకర్తలు మణి, విజయ, పార్వతి పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ జస్మీట్ సింగ్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్మీట్ సింగ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు.

ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- తెరువుపల్లి మైనర్ శారదా నది వద్ద ఘటన
- ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి
- మృతులు బావ బావమరుదులు



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ షేక్‌గఫూర్, ఎస్ఐ సింహాచలం (ఇన్‌సెట్) మృతులు శ్రీను, జగన్

యలమంచిలి: వారిద్దరూ బావ బావమరుదులు. వయసులో నాలుగేళ్ల వ్యత్యాసం ఉన్నా.. బంధుత్వానికి మించిన స్నేహం వారిది. ఒకరు ఐటీఐ తర్వాత అప్రంటిషిప్ పూర్తి చేసి ఉపాధి వేటలో ఉండగా, మరొకరు ఎంసెట్ పరీక్ష రాసి, ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. వేసవి సెలవులను ఆనందంగా గడపటానికి అమ్మమ్మగారి ఇంటికి వచ్చి బావతో కలిసి సరదాగా మైనర్ శారదానదిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లి ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపిన వివరాలు.

రాంబిల్లి మండలం దిమిలి ఎస్సీ కాలనీకి చెందిన యర్రంశెట్టి శ్రీను(22), గాజువాకకు చెందిన బంగారి జగన్(18)లు బావబావమరుదులు. జగన్ ఇంటర్ పాసై ఏపీ ఈఏపీసెట్ పరీక్ష రాశాడు. సెలవుల్లో తన అమ్మమ్మగారింటికి ఆనందంగా గడిపేందుకు వచ్చాడు. మంగళవారం తన బావ శ్రీనుతో కలిసి తెరువుపల్లి సమీపంలోని మైనర్ శారదా నది వద్దనున్న చిన్న ఆనకట్ట వద్దకు ఈత నేర్చుకునేందుకు వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. దీంతో ఈత రాని జగన్ నీటి ప్రవాహంలో మునిగిపోతుండగా, పక్కనే ఉన్న శ్రీను రక్షించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇరువురూ ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. అటుగా వెళ్తున్న ఉపాధి హామీ కూలీలు గుర్తించి వారిని బయటకు తీశారు. అయితే అప్పటికే జగన్ మృతి చెందాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శ్రీనును దిమిలి పీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

శ్రీను ఐటీఐ తర్వాత అప్రెంటీస్ చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. మృతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాధితుల్ని ఓదార్చేందుకు, మృతదేహాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మృతులు జగన్, శ్రీను తండ్రులు యర్రంశెట్టి అప్పారావు, బంగారి అప్పారావులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టంనకు యలమంచిలి తరలించినట్లు సీఐ గఫూర్, ఎస్ఐ సింహాచలం వెల్లడించారు.

చేతికి అంది వస్తారనుకుంటే..

చేతికి అందివస్తారనుకున్న బిడ్డలు నీటి మునిగి చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు, బంధువుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. 'ఊరిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా.. ముందుగా వెళ్లి సాయపడేదాన్ని, అలాంటి నా ఒక్కగానొక్క కొడుకు ప్రాణాలు కాపాడుకోలేకపోయాను దేవుడా'.. అంటూ శ్రీను తల్లి రోదన స్థానికుల్ని కంటతడి పెట్టించింది. స్నేహితులతో ఆప్యాయంగా తిరుగాడే శ్రీను మరణం పట్ల ఎస్సీ కాలనీ యువకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మహిళల జీవనాడి

- పల్లెల్లో జీడి పరిశ్రమ విస్తరణ
- జిల్లాలో చిన్నాపెద్ద 240పైగా ఫ్యాక్టరీలు
- స్థానికంగా 20 వేల మందికిపైగా ఉపాధి



జీడి పిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళలు

నాతవరం: పట్టణ, నగరాలకే పరిమితమైన జీడి పరిశ్రమలు గ్రామాలకు విస్తరిస్తున్నాయి. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. గతంలో వీరంతా కూలీ పని కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సొంతూర్లోనే ఉపాధి పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో 90 శాతం మహిళలే ఉండటం విశేషం. అనకాపల్లి జిల్లా 24 మండలాల్లో చిన్నా పెద్ద కలుపుకుని మొత్తం 240పైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో కేరళకు చెందిన ఓలం, శ్రీవిజయలక్ష్మి(వీఎల్‌సీ) ఫ్యాక్టరీలు 12 వరకు ఉన్నాయి. ఆయా ఫ్యాక్టరీల్లో అధికంగా మహిళలు పని చేస్తున్నారు. ఒక్కో ఫ్యాక్టరీలో 800 నుంచి వెయ్యి మంది వరకు మహిళలు పని చేస్తున్నారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా రోజుకు 18 నుంచి 20 వేల వరకు పని చేస్తున్నారు. వీరంతా కటింగ్, గ్రేడింగ్, పిల్లింగ్ వంటి పనులు చేస్తుంటారు. రోజూ 50 నుంచి 60 మంది వరకు మగవారు బస్తాలు మోయడం, పిక్కలను బాయిలింగ్ చేయడం వంటి పనులు చేస్తుంటారు.

ఉమ్మడి జిల్లాలో మొదటి పరిశ్రమ వెన్నలపాలెంలోనే..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రథమంగా 1991లో నాతవరం మండలం మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలో కేరళ రాష్ట్రానికి చెందిన శ్రీవిజయలక్ష్మి (వీఎల్‌సీ) ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట, కశింకోట, రోలుగుంట, రావికమతం, ఎస్.రాయవరం, యలమంచిలి మండలాల్లో కేరళ రాష్ట్రానికి చెందిన వారు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. ఆయా ఫ్యాక్టరీల నిర్వహణతో స్థానికులు కొంతమంది వీటి ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ పాలనలో జీడి పిక్కల ఫ్యాక్టరీల ఏర్పాటుకు ప్రోత్సహించి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించారు. దీంతో ప్రతి మండలంలో ఐదేళ్లలో జీడి పిక్కల ఫ్యాక్టరీలు ఏర్పాటు సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉమ్మడి జిల్లా 56 వేల ఎకరాల్లో జీడి పంట పండుతోంది. దీంతో ముడిసరుకు సమస్య లేకుండా తక్కువ ధరకు లభిస్తోంది.

నాతవరంలో స్థానికంగా ఉపాధి

నాతవరం మండలంలో తాండవ జంక్షన్, మన్యపురట్ల, శృంగవరం, ఎం.బి.పట్నం, జిల్లేడుపూడి గ్రామాల్లో పెద్ద ఫ్యాక్టరీలు, నాతవరం, చమ్మచింత, డి.యర్రవరం, వల్సంపేట, మర్రిపాలెం, గునుపూడి తదితర గ్రామాల్లో చిన్న ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయి. ఆయా ఫ్యాక్టరీల్లో స్థానిక మహిళలే పని చేస్తుంటారు. వీరంతా బాయిలింగ్ చేసిన పిక్కలను కంటింగ్ చేసి జీడి పప్పు తీస్తుంటారు. జీడి పప్పు తీసిన తర్వాత వాటిపై పొట్టును కూడా తీస్తారు. ఈ విధంగా ఒక్కొక్క మహిళ రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు సంపాదిస్తుంటారు. ఓలం, శ్రీవిజయలక్ష్మి (వీఎల్‌సీ) ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఇతర గ్రామాల నుంచి మహిళల కోసం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి తీసుకెళ్తున్నారు.

ఇతర దేశాలకు ఎగుమతి...

పెద్ద ఫ్యాక్టరీ యాజమాన్యం జీడి పప్పును ఇతర దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇక్కడ పండించిన జీడి పప్పు రుచి, నాణ్యత బాగుండటంతో ఇతర దేశాల్లో మంచి గిరాకీ ఉంటోంది. చిన్న ఫ్యాక్టరీలో తయారీ చేసిన జీడి పప్పు స్థానిక మార్కెట్లో విక్రయాలు చేస్తుంటారు. నంబర్ వన్ క్వాలిటీ కేజీ రూ.680, నంబరు టూ క్వాలిటీ కేజీ రూ.580 చొప్పున అమ్ముడుపోతోంది. కొంతమంది హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు ప్రైవేటు ట్రావెల్స్‌పై రోజూ సాయంత్రం తరలిస్తున్నారు.

రూ.25 లక్షల రుణంతో ఫ్యాక్టరీ పెట్టా



నాతవరంలో జీడి పిక్కల ఫ్యాక్టరీ నిర్మించాను. దీని కోసం రూ.25 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నాను. జీడిపప్పు విక్రయాలు చేసి బ్యాంకు రుణం మొత్తం చెల్లించా. మా గ్రామంలో మహిళలకు నేను సొంతంగా ఉపాధి కల్పించడం చాలా సంతోషంగా ఉంది. నేను ఫ్యాక్టరీ పెట్టక ముందు మా గ్రామ మహిళలు ఇతర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలో పని కోసం వెళ్లేవారు. సీజన్‌ను బట్టి ఫ్యాక్టరీకి వస్తుంటారు.

– **పోలుపర్తి రాధ**, మేనేజింగ్ డైరెక్టరు, సాయిబాలాజీ జీడి పరిశ్రమ, నాతవరం

గ్రామంలోనే ఉపాధి..



ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోకుండా గ్రామంలోనే జీడి పరిశ్రమలో ఉపాధి పొందుతున్నాను. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేస్తాం. పనిని బట్టి వేతనం వస్తోంది. ఊర్లోనే ఉపాధి పొందుతూ కుటుంబంతో ఆనందంగా జీవిస్తున్నాం. నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వేతనం పొందుతున్నాం.

– **పరపతి కృష్ణవేణి**, కార్మికురాలు, నాతవరం

బొజ్జన్నకొండ రహదారిపై సోలార్ వెలుగులు



బొజ్జన్నకొండ రహదారిపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుద్దీపాలు

తుమ్మపాల: పర్యాటక ప్రాంతంగా రూపాంతరం చెందుతున్న బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ రహదారిపై సోలార్ విద్యుద్దీపాలను మంగళవారం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మంజూరు చేసిన ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.1.5 కోట్లతో సుమారు 2.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డును నిర్మించిన విషయం తెలిసిందే. దీంతో జాతీయ రహదారి నుంచి బొజ్జన్నకొండకు అనువైన రహదారి ఏర్పడింది. ఈ రహదారితోపాటు తుమ్మపాల గ్రామం నుంచి బొజ్జన్నకొండకు ఉన్న రహదారిపై సోలార్ విద్యుత్ వెలుగుల కోసం మరో రూ.12 లక్షల నిధులను మంజూరు చేయడంతో మొత్తం 41 సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ రహదారి తుమ్మపాల, శంకరం గ్రామాల పరిధిలో ఉన్నందున రెండు గ్రామాల సర్పంచ్‌లు తట్టా పెంటయ్యానాయుడు, పసుపులేటి లక్ష్మి పనులను పర్యవేక్షించారు. మంగళవారం ఈ దీపాలను ఏర్పాటు చేసి ఎలా పనిచేస్తున్నాయో చూశారు.

క్లుప్తంగా

యలమంచిలి మార్కెట్ కమిటీకి యర్రయ్యదొర రాజీనామా

యలమంచిలి : యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి బొద్దపు యర్రయ్యదొర మంగళవారం యలమంచిలిలో రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఓటమి చెందిన కారణంగా బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) తనకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అప్పగించిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు, వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇకపైన కూడా వైఎస్సార్సీపీని యలమంచిలి పట్టణంతో పాటు మండలంలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, అలాగే పార్టీ క్రియాశీల కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు.

ఎస్ఐను దూషించిన ఘటనపై కేసు

అక్కిరెడ్డిపాలెం: డ్రంక్ అండ్ డ్రైవ్ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐను తండ్రి, కొడుకు దూషించడంతో కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్ విధుల్లో భాగంగా కణితి రోడ్డు మోర్ జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో గాజువాకకు చెందిన యువకుడు సంపర సాయి సూర్య, తండ్రి సంపర మురళీకృష్ణలు బైక్‌పై కణితి వైపు వెళ్తున్నారు. వీరిని ఎస్ఐ ఆపి వాహనం నడుపుతున్న కుమారుడ్ని డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేశారు. కుమారుడు మద్యం మత్తులో ఉండడంతో వారిపై కేసుకు ఉపక్రమిస్తున్నారు. ఆ సమయంలో తండ్రి ఎస్ఐతో వాగ్వివాదానికి దిగి పోలీసుల విధులకు తీవ్ర ఆటంకం కల్పించడంతో పాటు ఎస్ఐను అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో వారిపై ఎస్ఐ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తండ్రి, కొడుకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిన్నంటిన సంబరం
పోటెత్తిన భక్తజనం

పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలకు భక్తజనం పోటెత్తారు. మోదకొండమ్మతల్లి కరుణించమ్మా అంటూ పూజలు చేశారు. ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముగింపు ఉత్సవాలకు భారీగా తరలిరావడంతో పాడేరు జనసంద్రాన్ని తలపించింది. అమ్మవారికి ఐటీడీఏ పట్టువస్త్రాలు సమర్పించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారికి గజమాలతో అలంకరణ


అమ్మవారికి ఐటీడీఏ తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న పీవో అభిషేక్


మోదకొండమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన పాడేరులోని ప్రధానరోడ్డు


మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని మోస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- ఘనంగా ముగిసిన మోదకొండమ్మ ఉత్సవాలు
- తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి భారీగా భక్తుల రాక
- కిక్కిరిసిన పాడేరు
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఐటీడీఏ
- పోలీసుల భారీ బందోబస్తు

సాక్షి,పాడేరు: గిరిజనుల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. చివరి రోజు జాతరకు భారీగా రావడంతో పాడేరు రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఉత్సవాల మూడోరోజు కూడా అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి భక్తులు పోటెత్తారు. కలెక్టర్ ఎం.విజయసునీత, జేసీ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నర్సింగరావు పూజలు జరిపారు. ఐటీడీఏ తరఫున పీవో అభిషేక్ మోదమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఇంటి పండగలతో సందడి

అమ్మవారి ఉత్సవాల చివరిరోజు కావడంతో భక్తులంతా ఇంటి పండగలు జరుపుకున్నారు. అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ కుటుంబ సభ్యులతో కలిసి మోదమ్మకు మట్టి ఘటాలను సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులతో పాటు మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి మట్టి, ఇత్తడి ఘటాలు సమర్పించారు. భారీగా తరలిరావడంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు అమ్మవారి ఆలయం రద్దీ కొనసాగింది.

ఘనంగా ఊరేగింపు

ఉత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారి ఊరేగింపు సాయంత్రం నుంచి రాత్రి వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో ఏర్పాటుచేసిన సతకం పట్టు వద్ద మూడు రోజుల నుంచి పూజలు అందుకుంటున్న అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలకు కలెక్టర్ విజయ సునీత, జేసీ భావన వశిష్ట, పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గిడ్డి ఈశ్వరి,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, కె.వెంకటరమణ, టి.ప్రసాద్‌నాయుడు, వై.శ్రీనివాసరావు కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు బయటకు తీసుకువచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సంబరాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్రహాలను మోసేందుకు భక్తులు బారులు తీరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శక్తివేషాలు, గరగల నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి ఎనిమిది గంటల వరకు ఊరేగింపు జరిగింది. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ప్రధాన ఆలయానికి తీసుకువెళ్లడంతో ఉత్సవాలు ముగిశాయి. పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


బాణసంచా కాలుస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, చిత్రంలో జేసీ భావన



పాదాలు, ఘటాలతో కలెక్టర్ విజయసునీత, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కుటుంబసభ్యులతో ఘటాలతో బయలుదేరిన ఎంపీ తనూజారాణి


ఊరేగింపులో కాళీ శక్తి వేషం


అమ్మవారి ఉత్సవంలో ఆకట్టుకున్న శక్తి వేషాలు


ప్రత్యేక ఆకర్షణగా గరగల నృత్యం


ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరిన భక్తజనం


అమ్మవారికి భక్తులు సమర్పించిన ఘటాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి : జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ కథనం మేరకు వివరాలు...స్థానిక జాతీయ రహదారి శారదా బ్రిడ్జి వద్ద మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తిని, గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

జెడ్పీటీసీ రమణమ్మకు అంతిమ వీడ్కోలు


అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు, (ఇన్‌సెట్) రమణమ్మ (ఫైల్)

రావికమతం (చోడవరం) : రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ అంత్యక్రియలను ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం నిర్వహించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన రమణమ్మ విశాఖపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని స్వగ్రామం కొత్తకోటకు తీసుకువచ్చారు. ఆమె భౌతికకాయాన్ని దర్శించుకొని పెద్ద సంఖ్యలో ప్రజలు ఘన నివాళులను అర్పించారు. రమణమ్మ మృతిపై మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పలు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘించరాదు

ఆరిలోవ: ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించరాదని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు(జేడీ) డాక్టర్ డి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం అక్రమ పశు వధ, అక్రమ జంతు రవాణా చేయకూడదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిజర్వేషన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటర్ యాక్ట్ 1977 అండ్ ట్రాన్స్‌పోర్టు ఆఫ్ యానిమల్ రూల్స్ 1978, 2001 ప్రకారం జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి పారించాలన్నారు.

స్నేహితుడి హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

మల్కాపురం: స్నేహితుడ్ని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. ఐటీఐ జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారుజామున మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఉదయ్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. హత్యచేసిన యువకుడు హేమంత్, సహకరించిన సాయికిరణ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరిని మంగళవారం ఉదయం కోర్టుకు తరలించారు. కోర్టు వారికి రిమాండ్ విధించడంతో అడవివరంలోని సెంట్రల్ జైలుకు తరలించారు.

భవిత కేంద్రం సేవలు భేష్

అగనంపూడి: వడ్లపూడిలోని భవిత కేంద్రంలో అందుతున్న సేవలు ప్రశంసనీయమని భవిత కేంద్రం రాష్ట్ర అధికారి ఎస్.కల్పన అన్నారు. గాజువాక మండలం వడ్లపూడిలోని భవిత కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. భవిత కేంద్రం, ఫిజియోథెరఫీ కేంద్రం, ఇంద్రియ వనంను పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ద్వారా ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డిగ్రీలో చేర్పించాలన్నారు. బాలలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.


గంగమ్మ తల్లి


ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ తల్లి ఆలయం


గంగమ్మా కాపాడమ్మా: భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

గంగమ్మకు నీరాజనం

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి పండగ
- మొక్కులు తీర్చుకున్న మహిళలు

మహారాణిపేట : మత్స్య సంపద వేట బాగుండాలని, వేటకు వెళ్లే మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని మత్స్యకార మహిళలు గంగమ్మ తల్లిని మొక్కుకున్నారు. మంగళవారం గంగమ్మ తల్లి పండగను మత్స్యకార మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ తల్లి దేవాలయం వద్ద మహిళలు, మత్స్యకారులు మొక్కులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. బిందెలు, కలశాలతో పసుపు, కుంకుమ కలిపిన నీటిని తీసుకొని వెళ్లి సముద్రంలో వేసి సముద్ర దేవతను పూజించారు. గంగమ్మ తల్లి కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. ఈనెల 14న అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీ. మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో దేవాలయం వద్ద పలు ఏర్పాట్లు చేశారు. మత్స్యకార సంఘాల నాయకులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.


భక్తులతో రద్దీగా ఉన్న గంగమ్మతల్లి ఆలయ ప్రాంగణం


జెట్టీలో పసుపు, కుంకుమ కలిపిన నీరు సముద్రంలో పోసి పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు


ఫిషింగ్ హార్బర్‌లో శ్రీ గంగమ్మ దేవాలయం వద్ద మహిళల పూజలు


ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మకు పూజలు

క్లుప్తంగా

ఉపాధి పని దినాలు పెంచాలి



పీడీ సందీప్‌కు వినతిపత్రం అందిస్తున్న నానాజీ

అనకాపల్లి: ఉపాధి హామీ పథకం కార్మికులకు మరిన్ని పని దినాలు కల్పించాలని బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి పీత నానాజీ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో భూగర్భ నీటి మట్టాలు రోజు రోజుకూ అడుగంటిపోయాయని పేర్కొన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో పూడిక తొలగింపు, లోతు పెంపు, కందకాల తవ్వకం ద్వారా వర్షపు నీటిని ఒడిసి పడితే భూగర్భ జలాలు పెంచుకోవచ్చన్నారు. అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామం సర్వే నెం.385లో 2.85 ఎకరాల చెరువులో పూడికతీత పనులు చేపట్టి, ప్రజలకు పని దినాలు కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

జగన్నాథపురంలో ఇంటింటా ధర్మ ప్రచారం



ఆలయం వద్ద పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాథ పురంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి నియోజక వర్గ సంయోజకులు బి.వి.రమణ మాట్లాడుతూ సనాతన ధర్మం, సంప్రదాయాల్లో ఎన్నో నిబంధనలు ఉంటాయన్నారు. కొల్లి అప్పారావు, బంటు రాము, జోగినాయుడు, ఆనంద్ పాల్గొన్నారు.

మోదమాంబ పాదాలకు జలాభిషేకం



కలశాలతో వెళ్తున్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారం మోదమాంబ అమ్మవారికి జలాభిషేకం చేశారు. గురుమాత శ్రీనివాసరావు ఇంటి వద్ద అమ్మవారి పీఠం నుంచి 101 కలశాల తో మంగళవారం ఊరేగింపుగా ఆలయానికి చేరారు. అమ్మవారి పాదాలకు జలాభిషేకం చేశారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
రక్షణ	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 110 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,720	5,170
రెండో రకం	4,390	4,420
మూడోరకం	3,700	4,010

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 299 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

వాహనాల భారం.. వంతెన బలహీనం

- నిషేధమున్నా భారీ వాహనాల రాకపోకలు
- కూలిపోతుందన్న భయంలో స్థానిక ప్రజలు
- ఆందోళనకరంగా మామిడివాక గెడ్డ వంతెన





దెబ్బతిన్న వంతెన రైలింగ్, (ఇన్‌సెట్) భారీ వాహనాలకు ప్రవేశం లేదని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కశింకోట: మండలంలోని జి.భీమవరం వద్ద మామిడివాక గెడ్డపై బలహీనంగా ఉన్న వంతెన ఆందోళన కలిగిస్తోంది. దీనిపై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే రాకపోకలు మొత్తం బంద్ అయి, ఇబ్బంది పడాల్సి వస్తుందని వాహన దారులు, ప్రజలు వాపోతున్నారు.

అధికారులు హెచ్చరించినా..

రోడ్లు, భవనాల శాఖకు చెందిన తాళ్లపాలెం-నర్సీపట్నం మార్గంలో జి.భీమవరం వద్ద మామిడివాక గెడ్డపై 1972 సెప్టెంబర్‌లో వంతెన నిర్మించారు. వంతెన నిర్మించి అర్ధ శతాబ్దం దాటడంతో వంతెన బలహీన పడింది. భారీ వాహనాలు వంతెనపై ప్రయాణించరాదని అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు. వాటిని లెక్క చేయకుండా దాదాపు 50 టన్నులకు పైగా బరువున్న భారీ వాహనాలు, టిప్పర్లు నిత్యం వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా మాకవరపాలెం వద్దనున్న అన్‌రాక్ పరిశ్రమకు విశాఖ పోర్టు నుంచి బొగ్గు సరఫరా అవుతోంది. దీన్ని 16 చక్రాలతో నడిచే టిప్పర్లు, భారీ వాహనాలపై తరలిస్తున్నారు. నిత్యం వందకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. మరోవైపు రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న పోర్టుకు నర్సీపట్నం ప్రాంతం నుంచి పెద్ద బండరాళ్లు తరలిస్తున్నారు. ఇవి కూడా అధిక సంఖ్యలో టిప్పర్లపైనే రవాణా చేసుతన్నారు. కొన్నిసార్లు ఈ భారీ బండరాళ్లు దొర్లి కింద పడుతున్నాయి.

పరిమితి 20 టన్నులే

ఈ వంతెన బలహీనంగా ఉన్నందున 20 టన్నులకు మించి బరువున్న వాహనాలు రాకపోకలు సాగించరాదని అధికారుల ఆదేశాలు. అందుకు విరుద్ధంగా 50 టన్నులు, అంతకు మించి సామర్థ్యం కలిగిన వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల నుంచి నర్సీపట్నానికి రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన మార్గం. రోజూ నాన్‌స్టాప్, ఎక్స్‌ప్రెస్‌లు, పల్లె వెలుగు బస్సులు, ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వీటి వల్ల వంతెనకు ఎలాంటి నష్టం లేదు. భారీ వాహనాల రాకపోకలపైనే స్థానికులు భయపడుతున్నారు. గతంలో ఈ వంతెనను మూడు సార్లు మరమ్మతులు చేసి, పటిష్టం చేశారు. వంతెన ముందు భాగం దెబ్బతిని గొయ్యి పడటంతో ఆరు నెలల క్రితం దాన్ని పూడ్చి, తాత్కాలిక పనులు చేశారు. వంతెన రైలింగ్‌లు కూడా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వంతెనపై నుంచి భారీ వాహనాల రాకపోకల్ని నిషేధిస్తూ రోడ్లు, భవనాల శాఖ అధికారులు వంతెనకు రెండు వైపులా బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా భారీ వాహన రాకపోకలు ఆగట్లేదు. అధికారులు కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

భారీ వాహనాల్ని కట్టడి చేయాలి



వంతెన బలహీనంగా ఉంది. ఈ మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా భారీ వాహనాలు, టిప్పర్లు పెద్ద సంఖ్యలో నిత్యం వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా 16 చక్రాలతో నడిచే భారీ వాహనాలు బొగ్గు, రాయితో వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో వంతెనకు హాని జరిగే ప్రమాదం ఉంది. భారీ వాహనాల రాకపోకలను కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కాయల సూరిబాబు, జి.భీమవరం



వంతెనపై భారీ వాహనాల రాకపోకలు

ఇదే ప్రధాన మార్గం



అనకాపల్లి–నర్సీపట్నం మధ్య రాకపోకలు సాగించడానికి ప్రధాన మార్గం ఇదే. వంతెన బలహీనంగా ఉన్నందున ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి. వంతెన కూలిపోతే చాలా ప్రాంతాలకు రాకపోకలు దీర్ఘకాలం నిలిచిపోతాయి. ప్రజలు తీవ్ర ఇబ్బంది పడక తప్పదు. అందుకే దీనిపై భారీ వాహనాల్ని నడపొద్దని అధికారులు హెచ్చరించారు. అయినా ఎవరూ పట్టించుకోవట్లేదు. అధికారులు వీరిపై దృష్టిపెట్టాలి.

–కనపతి మాలినాయుడు, జి.భీమవరం.

చర్యలు తీసుకుంటాం

మామిడివాక గెడ్డపై వంతెన బలహీనంగా ఉంది. ఆరు నెలల క్రితం వంతెన ముందు భాగం దెబ్బతినగా, మరమ్మతులు చేపట్టాం. భారీ వాహనాల రాకపోకలకు అవకాశం లేదు. ఈ మేరకు హెచ్చరిక బోర్డులను వంతెన ప్రాంతంలో ఏర్పాటు చేశాం. ఈ మార్గంలో మెటీరియల్ తరలించే అన్‌రాక్ పరిశ్రమ వారికి భారీ వాహనాలు నడపవద్దని ఆరు నెలల క్రితం నోటీసులిచ్చాం. భారీ వాహనాల్ని నిలిపేశామని చెప్పారు. మళ్లీ ఇప్పుడు నడుపుతున్న విషయమై నిర్వాహకులకు నోటీసులిచ్చి, చర్యలు తీసుకుంటాం.

–సత్యవాణి, జేఈ, ఆర్ అండ్ బి, యలమంచిలి

రాష్ట్ర ప్రయోజనాలకు ప్రభుత్వం కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న బోయిన భానుమూర్తియాదవ్, పార్టీ నాయకులు

అనకాపల్లి: ఎన్డీయే కూటమిలో కీలకమైన భాగస్వామిగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బోయిన భానుమూర్తి యాదవ్ అన్నారు. స్థానిక న్యూకాలనీ తమ కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కేంద్రంలో ఉన్న రాష్ట్ర మంత్రులు ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌కు కృషి చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేలా పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మ చొరవ చూపాలన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించేలా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మలపురెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగన్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల కంటే, కూటమి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూడా ఎలాంటి మినహాయింపులు, కోతలు లేకుండా కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు దత్తు, సేనాపతి ఈశ్వరరావు, కత్తెర శ్రీధర్, తట్టా రమణ, సూరా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ విద్యార్థులకే తల్లికి వందనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: కొత్తగా కొలువుదీరనున్న ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, జీవో నెం.117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీని కొత్త ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించిందని, ఈ ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్ససాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు చంద్రరావు, జీఎస్ ప్రకాష్, చైతన్య, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కోన లక్ష్మణ

అనకాపల్లి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మిక సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. మండలంలోని మూలపేట గ్రామంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013న దివంగత సీఎం వైఎస్సార్ పాలనలో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, వారి సమస్యలు పరిష్కరించారని తెలిపారు. ఆ తర్వాతి ప్రభుత్వాలు సంక్షేమ బోర్డును పెద్దగా పట్టించుకోలేదన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగి, ఆస్పత్రి పాలైనా, చనిపోయినా, సహజ మరణం పొందినా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బోర్డు మండల అధ్యక్షుడు సీహెచ్ అప్పలరాజు, కార్యదర్శి మారేడుపూడి సత్యనారాయణ, సభ్యులు పల్ల నాగరాజు, తోట రాజు, ఉప్పిలి ఆదినారాయణ, శేష, ఎం.రాము, తోట ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ థియేటర్లో కల్కి ట్రైలర్ సందడి



కల్కి ట్రైలర్ రిలీజ్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ప్రభాస్ అభిమానులు

అనకాపల్లి: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి సినిమా ట్రైలర్ విడుదల సందర్భంగా స్థానిక సత్యనారాయణ థియేటర్ ఆవరణలో అభిమానులు సందడి చేశారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ గౌరవాధ్యక్షుడు అల్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైలర్ చూస్తుంటే హాలీవుడ్ స్థాయిలో సినిమాను తెరకెక్కించినట్లు తెలుస్తోందన్నారు. తెలుగు సినిమా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కల్కి విజయవంతమైనట్లేనని ఆనందం వ్యక్తం చేశారు. వేడుకల్లో ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జోగేంద్ర, కోశాధికారి కొణతాల అరవింద్, థియేటర్ అధినేత కొణతాల రామలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా



దుర్గమాంబను దర్శించుకొంటున్న భక్తులు

సబ్బవరం: సబ్బవరం ప్రజల ఆరాధ్య దేవత,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గమాంబ అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు.వేకువజాము నుంచి సబ్బవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించికొని ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు పసుపు కుంకుమలు,చీరలు అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం నుండి కోలాటం,బాణసంచా కాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై అవగాహన



మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆశ వర్కర్స్ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణిజగదీశ్వరి సూచించారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆశ వర్కర్స్‌తో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి, రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. హిమోగ్లోబిన్ సమస్యతో బాధపడే బాలింతలు, గర్భిణులపై అదనపు శ్రద్ధ చూపాలన్నారు. అంతకు ముందు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని తుమ్మపాల గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.సంఘం, ఎం.మరియమ్మ, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థతో సత్వర న్యాయం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ



సదస్సులో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ



హాజరైన గొరపల్లి గ్రామస్తులు

పెందుర్తి: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మండలంలోని గొరపల్లిలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు న్యాయ సహాయం అవసరం అయితే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని వ్యాజ్యాలు లేని గ్రామాలుగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.ఎస్ రంగలక్ష్మి, ఆర్ఐ సాయికిరణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజు, సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- ఎన్టీపీసీ హెడ్ సిన్హా



ట్రోఫీ ఆవిష్కరించిన సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఇతర అధికారులు

పరవాడ: క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఐ ఆర్ ఎస్ ఎం వాలీబాల్, త్రోబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. పవర్ పరిశ్రమల నుంచి విచ్చేసిన ఉద్యోగులు, యువతకు పోటీలు నిర్వహించారు. రామగుండం, తెలంగాణ, కుడ్గీ, సదరన్ రీజియన్ హెచ్‌క్యూ, సింహాద్రి స్టేషన్లకు చెందిన టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా ట్రోఫీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీజీఎం ఆర్.ఆర్ పరిదా, ఓ అండ్ ఎం జీఎం డేవిడ్, ఇతర ప్రముఖులు, జీఎంలు డేవిడ్, వి.టి కాంబ్లే, ఎస్.పద్మప్రియ, హెచ్‌వో హెచ్ఆర్ బి.బి.పాత్ర, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



సర్వసిద్ధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం : ఇళ్లలో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు పురస్కరించుకుని సర్వసిద్ధి, సైతారుపేట, ఎస్.రాయవరం తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్లలో తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ఎక్కువ రోజుల పాటు వాటర్ ట్యాంకుల్లో నీరు, ఆరుబయట ఉన్న రుబ్బురోళ్ల గుంటల్లో నీటి నిల్వల్లో దోమలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పారు. వర్షాలు సీజన్ ప్రారంభం అయినందున మరింత సమస్య ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి ఎన్.వాసంతి ఉన్నారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉన్నత శిఖరాలు



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మి

మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని డీఈవో ఎం.వెంకటలక్ష్మి అన్నారు. చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించిన లావేటి హాసిని, ఆడారి వేణుశ్రీ, యల్లపు శ్రావ్యలు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ జూనియర్ శశక్తి విభాగంలో ఎంపికైన నేపథ్యంలో మంగళవారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు, విశ్రాంత హెచ్‌ఎం ఎంటీ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, సీఆర్పీ గోవింద పాల్గొన్నారు.

కొండగెడ్డ వివాదంతో రైతులకు ఇబ్బందులు



కొండగెడ్డలో కాలువ తవ్విన దృశ్యం

ఎస్.రాయవరం : జేవీపాలెం సమీపంలో కొండగెడ్డ స్వరూపం మార్చడంపై వివాదం తలెత్తింది. కొండ గెడ్డ స్వరూపం మార్చడంతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు, వ్యవసాయ కూలీలు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో కళాశాల నిర్వహణదారులు, పలువురు భూస్వాముల మధ్య సఖ్యత లేకపోవడంతో సాధారణ వ్యక్తులకు సమస్యగా మారుతోంది. ఈ గెడ్డ వర్షాల సమయంలో నీరు ప్రవహించగా, వర్షాలు లేనప్పుడు వ్యవసాయ కూలీలు గోర్జిగా ఉపయోగించుకుంటారు. అయితే ఈ ప్రదేశాన్ని ఆక్రమణకు గురి చేస్తున్నారన్న నెపంతో ఒకరి తరువాత ఒకరు గుట్టు చప్పుడు కాకుండా స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలకు, పశువుల రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈ కొండగెడ్డను యథాస్థితిలో ఉంచి, పశువుల రాకపోకలకు వీలుగా ఉంచాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జయలక్ష్మిని వివరణ కోరగా ఇరిగేషన్ పరిధిలో ఉన్న కాలువ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. 2016 నుంచి ఈ కొండ గెడ్డ ఆక్రమణలపై సమస్య ఉందని ఇప్పుడు కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈ సమయంలో ఎవరు పనులు చేసినా శిక్షార్హులు అవుతారన్నారు.

మోడల్ స్కూల్లో ఖాళీ సీట్ల భర్తీకి 15న ప్రవేశపరీక్ష

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతులకు సంబంధించి మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 15న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మోడల్ స్కూల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8106521277 ఫోన్ నంబరును సంప్రదించాలని శ్రీలక్ష్మి కోరారు.

కూలిన చెట్టు తొలగించరూ!



సినిమాహాలు కూడలి-పరవాడ గ్రామాల మధ్య కూలిన చెట్టు

పరవాడ: గత నెల 31న రాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల కూలిన చెట్లను తొలగించడంలో రోడ్లు భవనాల శాఖ చర్యలు చేపట్టని కారణంగా గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఊట గెడ్డ కూడలి, గొర్లివానిపాలెం, పరవాడ గ్రామాలకు రాకపోకలు సాగించే రహదారులపై కూలిన చెట్లను ఇప్పటి వరకు తొలగించలేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. సినిమాహాలు కూడలి-పరవాడ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రోడ్డుపై కూలిన చెట్టు వాహనాల రాకపోకలకు పెద్ద అడ్డంకిగా మారింది. చెట్టు కూలిపోయి 12 రోజులు కావస్తున్నా ఆర్ అండ్‌బీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు వాటి వంక చూడకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు అవరోధంగా మారిన చెట్టును తొలగించడానికి చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.